ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 04.07.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , ఈ ఉదయం న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలుసుకున్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై హోంమంత్రి అమిత్ షాతో చర్చించారు.
2. రాష్ట్రంలో పదవీ కాలం ముగిసిన మండల ప్రజా పరిషత్ లకు, ప్రత్యేక అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.
3. నెట్, నీట్ అండర్ గ్రాడ్యుయేట్ పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విఫలమైందని ఆరోపిస్తూ, పలు విద్యార్థి సంఘాల పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నారు.
4. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా వివిధజిల్లాలలో ఈ రోజు పలు సంస్మరణ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

--------------------------

**రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన.....**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. వీరిరువురూ ఈ ఉదయం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలుసుకున్నారు. రాష్ట్ర సమస్యలను నివేదించి, రాష్ట్ర అభివృద్ధికి సహకారాన్నికోరేందుకు వీరిరువురూ హోంమంత్రిని కలిసినట్టు భావిస్తున్నారు. ఇప్పటికే పలువురు మంత్రులను ముఖ్యమంత్రి కలుసుకుని రాష్ట్ర సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించాల్సిందిగాకోరారు. ఈ సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలవనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

డెస్క్

---------------------------

**Local Bodies…..**

రాష్ట్రంలో పదవీ కాలం ముగిసిన మండల ప్రజా పరిషత్ లకు, ప్రత్యేక అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీటికి తిరిగి ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేకాధికారులు కొనసాగుతారని ఆ ఉత్తర్వులలో పేర్కొంది. 2019 మే నెలలో రాష్ట్రంలోని 5 వేలా 817 ఎంపిటిసి లకు ఎన్నికలు జరిగాయి. 490 మండల ప్రజాపరిషత్ పాలక వర్గాలకు 2019 జూన్ 4న ఎన్నికలు జరిగాయి. అదే రోజు ఎం.పి.పిలు, ఉపాధ్యక్షులు పదవీ స్వీకారం చేశారు. ఇప్పుడు వారి పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలనకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

ఇందుకు సంబంధించి వివిధ జిల్లాలలో కలెక్టర్లు ఆదేశాలు జారీచేశారు. ఆసిఫాబాద్ జిల్లా లో మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిషత్ కు కలెక్టర్ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తుండగా, పెద్ద మండలాలైన ఆసిఫాబాద్ కు ఆర్డిఓ లోకేశ్వరరావు, కాగజ్ నగర్ కు అక్కడి ఆర్డిఓ సురేష్ ను ప్రత్యేక అధికారిగా నియమించారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ సర్వసభ్య చివరి సమావేశం ఈరోజు జరుగుతున్నట్టు జెడ్పి సీఈవో జానకి రెడ్డి తెలిపారు. సమావేశానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరుకానున్నారు. అధికారులు ఇప్పటికే జిల్లాలోని 25 మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. మండల ప్రత్యేక అధికారులుగా జిల్లా స్థాయి అధికారులను నియమించినట్లు సీఈవో తెలిపారు. నిర్మల్ జిల్లాలో స్థానిక సంస్థల పాలకమండలుల పదవీ కాలం ముగియడంతో వారి స్థానంలో జిల్లాస్థాయి అధికారులను మండల పరిషత్తులకు ప్రత్యేక అధికారులుగా నియమించారు.

**పిటిసి, ఆసిఫాబాద్, నిర్మల్, సంగారెడ్డి,**

-------------------------------

**విద్యాసంస్థల బంద్ :**

నీట్ యుజి అండర్ గ్రాడ్యుయేట్ సెట్ పరీక్షలు నిర్వహించడంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విఫలమైందని ఆరోపిస్తూ.... ఈరోజు అఖిల పక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలలో విద్యా సంస్థల బంద్ జరిగింది. మంచిర్యాల జిల్లా లో విద్యార్థి సంఘాల ప్రతినిధులు జిల్లా కేంద్రంలో ర్యాలీ

నిర్వహించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'న్యాయమైన, సమర్థమైన పరీక్షా విధానం ఉండాలని వారు డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ప్రతినిధులు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు . విద్యార్థి సంఘాల పిలుపుమేరకు ఆసిఫాబాద్ జిల్లాలో విద్యాసంస్థల బంద్ జరిగింది. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలు ఒకరోజు ముందుగానే తమ పాఠశాలలకు సెలవు ప్రకటించాయి.

**పిటిసి, మంచిర్యాల , ఆసిఫాబాద్,**

------------------------------

**చెక్ డ్యామ్ ల నిర్మాణం:**

వేములవాడ నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న వంతెనలు, చెక్ డ్యాంల నిర్మాణపనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అధికారులను కోరారు. ముఖ్యంగా వర్షాకాలం నేపథ్యంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి ఆయన, వేములవాడ రూరల్, కోనరావుపేట, చందుర్తి మండలాల పరిధిలో పలు గ్రామాల్లో నిర్మిస్తున్న వంతెనలు, చెక్ డ్యాంల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు.

**పిటిసి, రాజన్న సిరిసిల్ల**

-------------------------------

**PM-VIVEKANANDA**

ఈరోజు స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు నివాళులర్పించారు. సామాజిక మాధ్యమం ద్వారా ఒక సందేశమిస్తూ ప్రధానమంత్రి.. స్వామి వివేకానందుడి బోధనలు - కోట్లాది మంది ప్రజలకు బలాన్ని ఇస్తున్నాయి అన్నారు. వివేకానందుని గొప్ప జ్ఞానం, జ్ఞానం కోసం నిరంతర అన్వేషణ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

**NSD**

----------------------------

**ఆదిలాబాద్-అమ్రుత్:**

కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ద్వారా ఆదిలాబాద్ పట్టణనికి సరిపడ తాగునీటిని అందించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారిలను ఆదేశించారు. ఈరోజు అమృత్ పథకంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమృత్ పథకం కింద పట్టణంలో 5 వాటర్ ట్యాంక్ లు నిర్మించామని తెలిపారు. 11 జోన్ లలో 215 కిలోమీటర్ల పొడవున పైప్ లైన్ ఎర్పాటు చేసి 21వేల 377 నల్లా కనెక్షన్లు ఎర్పాటు చేశామన్నారు.

**పిటిసి, ఆదిలాబాద్**

----------------------------

Doddi Komaraiah….

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన, తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో అమరుడైన దొడ్డి కొమురయ్య వర్ధంతి ఈరోజు. ఈ సందర్భంగా వివిధ జిల్లాలలో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించి ఆయనకు నివాళులర్పిస్తున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. పలువురు బీఆర్ఎస్ నేతలు సైతం సామాజిక మాధ్యమాల వేదికగా దొడ్డి కొమురయ్యకు నివాళులర్పించారు. జనగామ లోని కళ్లెం రహదారిలో ఏర్పాటుచేసిన దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని రాష్ట్ర రోడ్లు భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య లు ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య త్యాగాలను వారు స్మరించుకున్నారు.

**డెస్క్, పిటిసి,జనగామ**

---------------------------

**దొడ్డి కొమరయ్య....(2)**

దొడ్డి కొమరయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ సముదాయంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య78 వ వర్ధంతి కార్యక్రమంలోఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి, దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక కొమురయ్య అని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. జగిత్యాల కలెక్టరేట్ లో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

కామారెడ్డి జిల్లా  కలెక్టరేట్ లో నిర్వహించిన దొడ్డి  కొమరయ్యవర్ధంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ,దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

**పిటిసి, కామారెడ్డి, జగిత్యాల**

-------------------------

**అల్లూరి జయంతి:**

స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. గిరిజనులపై బ్రిటిష్ పాలకుల అనుచిత నిబంధనలు, ఆంక్షలకు వ్యతిరేకంగా మన్యం వీరుడు జరిపిన పోరాటాన్ని గుర్తు చేసుకుని ఆయనకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు పలు చోట్ల ఘనంగా నివాళి అర్పిస్తున్నారు.  హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పై గల అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జరిగిన జయంతి వేడుకల్లో  మంత్రి ధనసరి అనసూయ- సీతక్క ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్లమెంట్ లో మన్యం వీరుడు అల్లూరి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అందుకోసం ఒత్తిడి తెచ్చేలా తెలుగు రాష్ట్రాల పార్లమెంటు సభ్యులు కృషి చేయాలన్నారు.  అడవి బిడ్డల హక్కుల కోసం పోరాడిన అల్లూరి ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయం అన్నారు. భావి తరాలు ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

**MSL**

---------------------------

------------------------------------

**MODI- CRICKET TEAM (TAKE SUITABLY)**

న్యూఢిల్లీలో భారత పురుషుల క్రికెట్ జట్టుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమవుతారు. ఈ బృందం దేశ రాజధానిలోని, లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధానమంత్రి నివాసానికి చేరుకుంది. ఇదిలా ఉండగా, బార్బడోస్ గడ్డపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన వారికి స్వాగతం పలకడానికి దేశం మొత్తం ఆసక్తిగా ఉందని కేంద్ర క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవియా అన్నారు. బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ - రాజీవ్ శుక్లా మాట్లాడుతూ... ఈ విజయం వెనుక ఆటగాళ్లు, టీమ్ మేనేజ్‌మెంట్, బీసీసీఐ అధికారులందరి కృషి ఉందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం తర్వాత భారత క్రికెట్ బృందం ఓపెన్ టాప్ బస్సులో విజయోత్సవ యాత్రకు ముంబై వెళుతుంది. ఈ వేడుకలో పాల్గొనవలసిందిగా కెప్టెన్ రోహిత్ శర్మ అభిమానులకు విజ్ఞప్తి చేశారు.

**NSD**

--------------------------------

**క్రీడలు –క్రమశిక్షణ:**

క్రీడలు , చిన్నారులకు క్రమశిక్షణ నేర్పిస్తాయని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈరోజు మహబూబ్ నగర్ జిల్లా క్రీడా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన 10వ , అండర్ 19 తెలంగాణ జూనియర్ బాట్మెంటన్ చాంపియన్ షిప్ 2024 పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ,మహబూబ్ నగర్ పట్టణం రాష్ట్ర స్థాయి

పోటీలకు వేదిక కావడం ఆనందంగా ఉందని అన్నారు. జిల్లా నుంచి గొప్ప క్రీడాకారులను వెలికితీసి జాతికి పరిచయం చేయాలని ఆయన నిర్వాహకులకు సూచించారు.

**స్ట్రింగర్, మహబూబ్ నగర్**

---------------------------

**వర్షం....**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు ప్రాంతాలలో రెండు రోజులుగా వర్షం కురిసింది. అత్యధికంగా రుద్రంగిలో 28.3 మిల్లీమీటర్లు, చందుర్తిలో 21.6, వేములవాడ రూరల్లో 17.7, బోయి నపల్లిలో 13.9 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఎల్లారెడ్డిపే టలో పెద్దగా వర్షం పడలేదు.

**పిటిసి రాజన్నసిరిసిల్ల**

----------------------

**ఎస్సీ కమిషన్ సమీక్ష:**

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వి.రాం చందర్, పెద్ద పల్లి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ , డిసిపి ఎం.చేతన, జాతీయ ఎస్సీ కమీషన్ సంచాలకులు సునీల్ బాబు, జిల్లాలోని ఇతర అధికారులు పాల్గొన్నారు.. షెడ్యూలు కులాల సంక్షేమానికి పెద్ద పల్లి జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ

కార్యక్రమాల వివరాలను అదనపు కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. సమీక్షా సమావేశం అనంతరం జాతీయ ఎస్సీ కమీషన్ సభ్యులు వి.రాం చందర్ మీడియాతో మాట్లాడుతూ గత 2 రోజులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా లోని 4 జిల్లాలు పర్యటించి ఎస్సి, ఎస్టీలకు అందవలసిన వివిధ పథకాలు అమలవుతున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించినట్లు తెలిపారు.

**పిటిసి, కరీంనగర్**

----------------------

**ఉపాధ్యాయ అవార్డు...**

2024 సంవత్సరానికి ,జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపికకు , అర్హత గల ఉపాధ్యా యులు ఈ నెల 15వ తేదీలోగా ఆన్ లైన్ లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని నల్లగొండ జిల్లా విద్యా శాఖాధికారి బి. భిక్షపతి కోరారు. అర్హత గల ఉపాధ్యాయులు http:///national awards to teachers.education.gov.in వెబ్ సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

**పిటిసి, నల్లగొండ**

---------------------------